సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 15 | ఫిబ్రవరి | 2024



ఆధ్యాత్మిక వైభవం చాటుదాం

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలను బాగా నిర్వహించి, ఆధ్యాత్మిక వైభవం చాటాలని జీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు.

8లో



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బండారు కృష్ణప్రసాద్, అరుణ కుమారి దంపతులు (విజయవాడ) రూ.1,00,116 విరాళంగా సమర్పించారు.

8,300 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు



ముమ్మిడివరంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

ముమ్మిడివరం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మూడో అంతస్తులో భద్రపర్చిన ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాములను బుధవారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలు, సీసీ కెమెరాల పనితీరును రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులతో కలసి తనిఖీ చేశారు. వాటి భద్రతకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతినెలా ఈవీఎ, వీవీ ప్యాట్ గోదాములను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మూడు నెలలకోసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పరిశీలిస్తున్నామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



ఉత్తమ డ్రైవర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి నాగేశ్వరరావు

అమలాపురం రూరల్: రహదారి భద్రతపై అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు అన్నారు. గత నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకూ నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకలు అమలాపురంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఐ రవికుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, దురాలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ముగ్గురు ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు, డిపో స్థాయిలో 12 మంది ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ఆర్టీసీ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది వివిధ స్కూళ్ల విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం, రాజోలు, రామచంద్రపురం డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణమూర్తి, భాస్కరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు

రాజానగరం: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని ఎస్‌వీకేపీ, డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీలలో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు జరుగనున్నాయి. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్, తెలుగు సంపద సంస్థలతో కలసి నిర్వహించే ఈ ఉత్సవాలలో ఆసక్తి ఉన్న వారు నాణ్యమైన పరిశోధన పత్రాలను సమర్పించవచ్చని నిర్వాహకులు సదస్సు కన్వీనర్, 'నన్నయ వర్సిటీ' తెలుగు అధ్యాపకులు డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్ తెలిపారు. ఈ పత్రాలను యూజీసీ కేర్ లిస్టెడ్ జర్నల్ ప్రత్యేక సంచికలో ప్రచురిస్తామన్నారు. ఈ ఉత్సవాలు (సదస్సు)లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు పూర్తి వివరాలకు 9491574733కి ఫోన్ చేయవచ్చు. కాగా నిర్వాహకులు పేర్కొన్న 17 అంశాలపైనే పరిశోధన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

జిల్లాకు రెండు బయోగ్యాస్ ప్లాంట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొవ్వూరు మండలం కాపవరం దొమ్మేరులో రూ.256 కోట్ల పెట్టుబడితో 270 మందికి ఉపాధి నిచ్చేలా రెండు బయో ప్లాంట్ యూనిట్లు నెలకొల్పనున్నట్లు కలెక్టర్ మాధవీలత అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కాపవరం గ్రామంలో 'రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్' ఏర్పాటు చేయబోయే పరిశ్రమకు కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకటరావుతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. కలెక్టర్ వివరాలు తెలియజేస్తూ మంత్రి గుడివాడ అమర్నాథ్‌గా చేతుల మీదుగా బుధవారం వెలగపూడి నుంచి వర్చువల్ విధానంలో దీనిని ప్రారంభించామన్నారు.

వావ్‌లంటీర్లు

సేవకు సత్కారమిది.. ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహమిది.. సంక్షేమాన్ని ప్రజలకు చేర్చే సారథులకు దక్కుతున్న గౌరవమిది.. పేదల ఇంటికే ప్రభుత్వ పథకాలను చేర్చుతున్న వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాది 'వలంటీర్లకు వందనం' పేరిట పురస్కారాలు అందించేందుకు రంగం సిద్ధం చేసింది.. వలంటీర్ల వ్యవస్థ దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందనడానికి సాక్ష్యమిది..

- ప్రజా సేవకులకు సత్కారం
- జిల్లాలో 34 మంది వలంటీర్లకు సేవావజ్ర
- 130 మందికి సేవారత్న, 9,417 మందికి సేవామిత్ర
- నియోజకవర్గాల వారీగా పురస్కారాల అందజేత

సాక్షి, అమలాపురం: ప్రతి నెలా ఒకటిన తెల్లవారకుండానే పేదలకు పింఛన్ అందిస్తున్నా.. ప్రతి సంక్షేమ పథకం లబ్ధి వంద శాతం అర్హులకు చేరుస్తున్నా.. గోదావరి వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు ఆహారం, తాగునీరు చేరుతుందంటే, ఇదంతా గ్రామ, పట్టణ వార్డు వలంటీర్ల ఘనతే. పథకాలను పేదల చెంతకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తిస్తోంది. నిస్వార్థంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వలంటీర్లకు వందనం పేరిట గత మూడేళ్లుగా సేవా పురస్కారాలతో సత్కరిస్తోంది. ఇందులో భాగంగా వరుసగా నాలుగో ఏడాది పురస్కారాలు అందజేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 15న గుంటూరు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవార్డులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. తరువాత జిల్లాలో పది రోజుల పాటు నియోజకవర్గాల వారీగా వేడుకలు నిర్వహించి 9,581 మందిని సత్కరించనున్నారు.

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసే లక్ష్యంతో సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. 2019 ఆగస్టు 15న ప్రారంభమైన ఈ వ్యవస్థ ప్రజలతో మమేకమైంది. పారదర్శకంగా సేవలందిస్తూ దేశవ్యాప్తంగా ప్రముఖుల ప్రశంసలు అందుకుంటోంది. అప్పట్లో కరోనా మహమ్మారికి భయపడి అయిన వారే దగ్గరకు రాని సమయంలో కోవిడ్ బాధితులు కోలుకునేంత వరకూ ప్రభుత్వం ద్వారా వలంటీర్లు అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల చెంతకు సైతం వెళ్లి పింఛన్ అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా 2022 జూలై, ఆగస్టులలో జిల్లాలో గోదావరికి రికార్డు స్థాయిలో వరదలు వచ్చిన సమయంలో వలంటీర్ల సేవలు మరువలేనివి. పడవలపై ప్రాణాలకు తెగించి తిరుగుతూ ప్రభుత్వం అందించిన బియ్యం, నిత్యావసరాలు, ఆహారం, మంచి నీరు అందించి శెభాష్ అనిపించుకున్నారు. రేయింబవళ్లు గోదావరి ఏటిగట్లపై పహారా కాస్తూ గండ్లు పడకుండా అధికారులను అప్రమత్తం చేశారు. వారు అందించిన సమాచారం కారణంగానే రాజోలు మండలం సోంపల్లి వద్ద గండి పడకుండా ఇరిగేషన్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

పూర్తయిన ఎంపిక

జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పాలక సంస్థతోపాటు 22 మండలాల్లో 9,581 మంది వలంటీర్లు ఉన్నారు. ఇంచుమించు అందరూ పురస్కారాలకు ఎంపికయ్యారు. 34 మందికి సేవా వజ్ర, 130 మంది సేవారత్న, 9,417 మంది సేవా మిత్ర అవార్డులు పొందనున్నారు. మరోపక్క నవరత్న పథకాలతో మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలకు సంబంధించి ఆయా వలంటీర్ల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల లబ్ధిదారుల ఉత్తమ వీడియోలు చిత్రీకరించిన మరికొందరికి ప్రత్యేక బహుమతులు అందజేయనున్నారు. ప్రతి మండలం, పట్టణ స్థాయిలో ఒకరు, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో ఒకరికి చొప్పున ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి రూ.15 వేలు, నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఎంపిక చేసిన వారికి రూ.20 వేలు, జిల్లాకు ఒకరిని చొప్పున ఎంపిక చేసి రూ. 25 వేలు అందజేయనున్నారు.



వరద బాధితులకు అల్పాహారాన్ని ప్యాక్ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)



తెల్లవారు జామునే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



వరదల సమయంలో వాకలగరువు ఫెర్రమెన్‌పేట వద్ద విధులు నిర్వహిస్తున్న వలంటీర్ (ఫైల్)

సేవలకు తొలి గుర్తింపు



ఈమె పేరు ఒరుగుల సుబ్బలక్ష్మి. అల్లవరం మండలం కొమరగిరిపట్నం–3 వలంటీర్‌గా పనిచేస్తోంది. ఆమె సేవావజ్ర పురస్కారానికి ఎంపికైంది. సకాలంలో పింఛన్లు అందించడంతోపాటు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికి చేరవేయడంలో చేస్తున్న కృషికి ఈ అవార్డు వరించింది. అధికారులు ఇచ్చిన గడువుకన్నా ముందుగానే పనులు చేస్తోంది. నాలుగేళ్లలో సేవావజ్ర రావడం ఇదే తొలిశారని, మరింత బాధ్యతగా సేవలు అందిస్తానని సుబ్బలక్ష్మి చెబుతోంది.

అంకితభావంతో ఉన్నతి



రామచంద్రపురం నియోజకవర్గం ఉప్పుమిల్లికి చెందిన ఈమె పేరు దంగుడు బియ్యం ఉమాదేవి. వలంటీర్‌గా పనిచేస్తున్న ఆమె సేవా వజ్ర పురస్కారానికి ఎంపికైంది. పింఛన్ల పంపిణీ, ఇతర కార్యక్రమాల నిర్వహణలో చూపుతున్న అంకితభావమే ఆమెను ఉన్నత స్థానంలో నిలిపింది.

నిస్వార్థ సేవలకు గుర్తింపు

వలంటీర్ల పనితీరు ఆధారంగా అవార్డులు అందిస్తున్నారు. ఫిర్యాదులు లేకుండా ఏడాదికి పైగా సేవలందించిన వలంటీర్లను సేవామిత్ర, విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఐదుగురు చొప్పున, కార్పొరేషన్‌లో 10 మంది చొప్పున సేవారత్న అవార్డు ఇస్తారు. ఈ ఏడాది శాలువాలతో సత్కరించి నగదుతో పాటు బ్యాడ్జీలు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష కలాల పూజ



అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి పాదాల చెంత ఉంచిన లక్ష కలాలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం రెండోరోజు వేద పండితుల ఆధ్వర్యంలో చదువుల పండుగ పేరుతో సరస్వతీ యాగం నిర్వహించారు. ఈ పూజలను ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులు నిర్వహించారు. గణపతి పూజ, సరస్వతీకల్పం, సరస్వతీ మండపారాధన, మహన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం, శాంతి మంత్ర పఠనం, లక్ష గరిక పూజ, లక్ష కలాల పూజ, పుష్పార్చన, సరస్వతీ హోమం జరిపారు. విఘ్నేశ్వర స్వామికి లక్ష గరికపూజ చేసి స్వామివారి పాదాల చెంత లక్ష కలాలు ఉంచారు. స్వామివారి ప్రసాదంగా లభించిన కలంతో విద్యార్థులు పరీక్షలు రాస్తే శుభ ఫలితాలు సాధిస్తారనే నమ్మకం. ఈ కలాల కోసం విద్యార్థులు భారీ ఎత్తున విఘ్నేశ్వర స్వామివారిని దర్శించి కలాలను తీసుకెళ్లారు. 14 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నామని చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 500 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు, 100 మందికి అన్నప్రాశనలు, 60 మందికి నామకరణలు జరిగాయి.

దేవాలయాలకు నూతన శోభ



వానపల్లి పళ్లాలమ్మ క్షేత్రంలో ముఖ మంటపం, రాజగోపురం ప్రారంభ శిలాఫలకాన్ని, ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కరరామం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- వానపల్లి పళ్లాలమ్మ క్షేత్రంలో అభివృద్ధి పనులు ప్రారంభం

కొత్తపేట: దేవదాయ శాఖ సీజీఎఫ్, టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.14.35 కోట్లతో నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు నూతన శోభ తీసుకువచ్చామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. వానపల్లి గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పళ్లాలమ్మ అమ్మవారి క్షేత్రంలో దేవదాయ శాఖ నిధులు రూ 84.50 లక్షలతో నిర్మించిన ఆలయ ముఖ మంటపం, శాలాహారం, రాజగోపురాన్ని జగ్గిరెడ్డి ఆ గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం (ప్రజా ప్రయోజనాలు)తో కలసి ప్రారంభించారు. అనంతరం రాజగోపురంపై శిఖర ప్రతిష్ఠ, ప్రాకార మంటపానికి భూమిపూజ చేశారు. ముందుగా దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న దంపతులు మండపారాధన, హోమ పూజలు నిర్వహించారు. అనంతరం సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామ వాసి నేమాని భాస్కరరామం ప్రత్యేక శ్రద్ధతో పళ్లాలమ్మ ఆలయ అభివృద్ధి బాటలు పడ్డాయన్నారు. ఎన్నో దేవాలయాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రత్యేక నిధులు మంజూరు చేయించామన్నారు. నియోజకవర్గంలో వానపల్లి పళ్లాలమ్మ ఆలయంతో పాటు వాడపాలెం, రావులపాలెం మండలం గోపాలపురం, ఆత్రేయపురం మండలం పులిదిండి, ఆలమూరు మండలం చింతలూరు ఆలయాలకు రూ.9.95 కోట్లు విడుదల కాగా, ఆ పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. అలాగే 44 రామాలయాలకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.4.40 కోట్లు విడుదల చేయించామన్నారు. మరో 44 ఆలయాలకు రూ.4.40 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నేమాని భాస్కరరామం మాట్లాడుతూ గ్రామస్తులు చేయీ చేయీ కలిపితే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సీజీఎఫ్ కట్టకుండా ఆలయానికి రూ.1.68 కోట్లు తెచ్చుకున్నామన్నారు. వానపల్లిలో ఇరిగేషన్ బ్రిడ్జికి సంబంధించి రూ.6 కోట్లకు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ అయ్యిందన్నారు. ఇదే గ్రామంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.1.30 కోట్లతో నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఏప్రిల్ 21న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, బోనం సాయిబాబు, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు దుప్పలపూడి సత్యవేణి, సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతుండడంతో ఆలయ ప్రాంగణంలో నవ దంపతుల సందడి నెలకొంది. బుధవారం తెల్లవారుజామున 4-02 గంటల ముహూర్తంలో రత్నగిరిపై వివిధ సత్రాలు, ఉచిత కల్యాణ మంటపాలలో 40కి పైగా వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత మంటపాలు, విశ్రాంత మంటపాలు నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవ దంపతులు

జిల్లాకే తలమానికం ఆర్టీసీ టెర్మినల్

- మంత్రి విశ్వరూప్, ఎండీ తిరుమలరావు
- అత్యాధునిక వసతులతో బస్ కాంప్లెక్స్ నిర్మాణం
- రూ.45 కోట్లతో పనులకు శంకుస్థాపన



అమలాపురం బస్ కాంప్లెక్స్ టెర్మినల్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్, ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: జిల్లాకే తలమానికంగా అమలాపురంలో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ మాదిరిగా అత్యాధునిక వసతులతో నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. బుధవారం అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో సుమారు రూ.45 కోట్లతో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న అత్యాధునిక స్టేషన్, బస్సు కాంప్లెక్స్ టెర్మినల్‌కు మంత్రి విశ్వరూప్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజల ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ బస్ కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మాణానికి తొలి దశలో రూ.5 కోట్లు రాష్ట్ర రవాణా శాఖ ద్వారా కేటాయించామన్నారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి, దాని స్థానే అత్యాధునిక కాంప్లెక్స్ టెర్మినల్‌ను 24 ప్లాట్‌ఫారాలతో పాటు మూడు అంతస్తులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మిస్తామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ బస్ కాంప్లెక్స్ టెర్మినల్‌ను 9 నెలల్లో అందుబాటులో తెస్తామని, మూడు అంతస్తులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కమర్షియల్‌గా ఇస్తామన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుతం మంజూరైన రూ.ఐదు కోట్లతో పాటు మరో రూ.మూడు కోట్లు వెచ్చించి గ్రౌండ్ ఫ్లోర్ నిర్మిస్తామన్నారు. మొదటి రెండు ఫ్లోర్స్‌కు పీపీపీ విధానంలో బిడ్డింగ్ కాల్ ఫర్ చేస్తామన్నారు. ప్రస్తుతం కమర్షియల్ కాంప్లెక్స్‌లకు డిమాండ్ ఉందని, దానికి అనుగుణంగా నిర్మిస్తామన్నారు. అమలాపురం బస్ స్టేషన్‌లో పదేళ్లుగా బీఓటీ పద్ధతిలో చేపట్టిన నిర్మాణం పునాది దశలో ఉండటాన్ని గమనించామని, దీనిపై సత్వరం చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎస్పీ శ్రీధర్, ఆర్టీసీ చీఫ్ సివిల్ ఇంజినీర్ శ్రీనివాస్, జోనల్ చైర్మన్ పి.మహేష్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్ గోపాల్, వైస్ ఎంపీపీలు అడపా సుబ్రహ్మణ్యం, పొలమూరి బాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పట్టణ, రూరల్ వైఎస్సార్ అధ్యక్షులు సంసాని నాని, డాక్టర్ పినిపే శ్రీకాంత్ పాల్గొన్నారు.

'పోలవరం' ఆలస్యానికి చంద్రబాబే కారణం

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, ఎంపీ బోస్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, ఎంపీ బోస్

రామచంద్రపురం: పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమైందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకూ జరిగిన విషయాలను తెలియజేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి రూపొందించిన డాక్యుమెంటరీ సీడీలను రామచంద్రపురంలోని ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో బుధవారం నాగిరెడ్డి, ఎంపీ బోస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ పోలవరం రాష్ట్ర ప్రజల దశాబ్దాల కల అన్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రుల తరువాత పోలవరాన్ని నిర్మించాలని తలచి రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే మొదలు పెట్టింది దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు ప్రభుత్వంలో డయాఫ్రం వాల్‌ను ముందుగా మొదలు పెట్టి, దానికి కావాల్సి నిర్మాణాలు లేకుండానే పనులు చేయడం కారణంగానే డయాఫ్రం దెబ్బతిందని నాగిరెడ్డి స్పష్టం చేశారు. దీనివల్ల ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అవుతుందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా తెలియజేసిందన్నారు. అయితే చంద్రబాబు మాత్రం తన ప్రభుత్వంలోనే డ్యామ్ మొత్తం పూర్తయ్యిందని ఎంతో ఆర్భాటంగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పటి వరకూ అన్ని పనులను శరవేగంగా చేసుకుంటూ ప్రస్తుతం డ్యామ్‌ను పూర్తి చేశారన్నారు. ఈసీఆర్‌ఎం డ్యామ్ పూర్తయిన వెంటనే లెఫ్ట్, రైట్ కెనాల్స్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని వివరించారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి మొదలు పెట్టిన పోలవరం ప్రాజెక్టును ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత రైతులకు నీరు ఇవ్వబోతున్నారని స్పష్టం చేశారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వమే 78 శాతం పనులను పూర్తి చేసిందని చంద్రబాబు చెప్పుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా నేడు పోలవరం ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. ఈ పనుల్లో కమీషన్లు పొందాలనే ఏకైక సంకల్పంతో చంద్రబాబు పని చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మూడు అథారిటీల ద్వారా టీడీపీ హయాంలోనే ప్రాజెక్టు 78 శాతం పూర్తయ్యిందని చెప్పిస్తే, తామే ఒప్పుకుంటామని బోస్ అన్నారు. డాక్యుమెంటరీని తయారు చేసిన త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ పోలవరం చరిత్ర, దాని నిర్మాణం ఎవరి హయాంలో ఏవిధంగా జరిగిందనే విషయాలను డాక్యుమెంటరీ ద్వారా తెలియజేశామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

కొవ్వూరు: జాతీయ రహదారిపై దొమ్మేరు సమీపంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారు జామున సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ గొలుగూరి బాపిరాజు పట్టుకున్నారు. నల్లజర్లలోని శ్రీరామ చంద్ర రవ్వమిల్లు నుంచి యనాంకు ఈ బియ్యం తరలిస్తున్నట్లు ఆయన వివరించారు. లారీని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. 21,960 కిలో బియ్యాన్ని సీజ్ చేసి, నిడదవోలులోని సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించామని అన్నారు. కాకినాడ జిల్లా తూరంగి గ్రామానికి చెందిన లారీ యజమాని వంకా వీరవెంకట సత్యనారాయణ, నల్లజర్ల రవ్వమిల్లుపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ బియ్యం విలువ రూ.9,2,320 ఉంటుందని ప్రాథమిక అంచనా వేశామన్నారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేశామని బాపిరాజు తెలిపారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం అవుతున్న మైదానం

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉబా జాన్‌మోజెస్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.పట్టాభిరామం తెలిపారు. వైఎస్సార్ మెమోరియల్ పేరిట సీనియర్ 2024 పురుషులు, స్త్రీల విభాగాల్లో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13 జిల్లాల జట్లు చాంపియన్‌షిప్ కోసం పోటీ పడతాయన్నారు. ఈ టోర్నమెంట్‌ను పెద్దాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ప్రారంభిస్తారన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాల పురుషుల, మహిళల జట్లు పాల్గొంటాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. డే అండ్ నైట్ టోర్నమెంట్‌లో భాగంగా ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 60 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. విజేతలు ఉత్తరాఖండ్‌లో మార్చిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఖోఖో పోటీలకు సంబంధించి కోర్టులను సిద్ధం చేస్తున్నామన్నారు.

ఆధ్యాత్మిక వైభవం చాటుదాం

- అంతర్వేది ఉత్సవాలపై కలెక్టర్ హిమాన్షు శుక్లా దిశానిర్దేశం
- సమన్వయంతో సాగాలని అధికారులకు సూచన



అంతర్వేది తీర్థ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, ఆధ్యాత్మిక వైభవం చాటాలని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. అంతర్వేది క్షేత్రంలో ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకూ జరగనున్న లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. తొలుత దేవస్థానం పరంగా తీసుకుంటున్న చర్యలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. వేలాదిగా తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల ఏర్పాటు పనులు పూర్తి కావొస్తున్నాయన్నారు. స్వామివారి కల్యాణం జరిగే ప్రాంతంలో ప్రముఖులు వీక్షించేందుకు గ్యాలరీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఆయా శాఖల పనుల పురోగతిని సంబంధిత అధికారులు తెలిపారు. తీర్థం జరిగే ప్రాంతంలో 62 మొబైల్ టాయిలెట్స్, బీచ్‌లో దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు వివరించారు. బీచ్‌లో భక్తుల సముద్ర స్నానాలకు అనుగుణంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ రాజ్ శాఖను కలెక్టర్ శుక్లా ఆదేశించారు. బీచ్‌లో భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఫిషరీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. సముద్ర తీరంలో వంద మంది గజ ఈతగాళ్లను ఉంచనున్నట్లు ఆ శాఖ అధికారి తెలిపారు. తీర్థంలో ఆరు వైద్య బృందాలు, రెండు 108 అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. తీర్థంలో మద్యం, మాంసం దుకాణాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ, పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కల్యాణం, రథోత్సవం, పౌర్ణమి స్నానాలు రోజుల్లో పటిష్టమైన భద్రతకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ ఏటా పెరుగుతున్న రద్దీని అనుగుణంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తీర్థంలో స్థానికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ మాట్లాడుతూ తీర్థంలో 1,600 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్కింగ్ స్థలాలను త్వరితగతిన సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఎండోమెంట్స్ డీసీ ఎం.విజయరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంతర్వేది కల్యాణోత్సవానికి గుర్తింపు ఉందని, ఇందుకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సమీక్షలో జెడ్పీటీసీ సభ్యులు దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు, డాక్టర్ యునుస్, రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు, ఎస్సై ఎస్.రాము, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీఓ బడుగు మంగాదేవి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలన

తీర్థంలో ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్, ఎస్పీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కల్యాణం జరిగే చోట గ్యాలరీల ఏర్పాటు, వీఐపీ మార్గాలపై ఎండోమెంట్స్ డీసీ విజయరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో చర్చించారు. కల్యాణ వేదికపై ఎక్కువ మంది లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రథం వెళ్లే రోడ్డు మార్గాలను పరిశీలించారు. ఈ రోడ్డు మార్జిన్లలో రెవెన్యూ గెస్ట్ హౌస్ వరకూ ఎటువంటి దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దని ఆ శాఖకు సూచించారు. స్వామివారి కల్యాణం భక్తులు వీక్షించేందుకు స్క్రీన్‌లను పదికి పెంచాలని కలెక్టర్ సూచించారు. తీర్థంలో బస్టాండ్ ఏర్పాటు స్థలాన్ని, తెప్పోత్సవం జరిగే చెరువును కూడా వారు పరిశీలించారు.

వకుళమాత భవన నిర్మాణానికి రూ.10 లక్షలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నందిగామకు చెందిన కె.వెంకట నారాయణ రూ.10 లక్షలు సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. దాతకు వారు స్వామివారి చిత్రపటం అందజేశారు.

శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా

తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తంటికొండ వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

గోకవరం: శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా అంటూ ఆ స్వామివారిని భక్తజనం కొలిచింది.. తంటికొండ గ్రామంలోని వెంకటగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని చూసిన ప్రతి మది పులకించింది. స్వామివారి 64వ బ్రహ్మోత్సవాలను బుధవారం అత్యంత ఘనంగా ప్రారంభించారు. ఉదయం 9.30 ఆలయ ప్రదక్షిణ, స్వస్తి వాచనం, స్వామివారి పాదసేవ, హారతి, సంకల్పంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, ఋత్విక్ వరుణ, దీక్షారాధణ, అకల్మష కూష్మాండ హోమం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి) దంపతులు పీటలపై కూర్చుని ఈ పూజాదికాలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఓ గంజి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నేటి పూజలు

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు గురువారం స్వామివారికి శాంతి కల్యాణం, లక్ష్మీవేంకటేశ్వర హోమం, గోపూజ, లక్షతులసి పూజ వంటివి నిర్వహిస్తారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేగం.. తెచ్చిన ప్రమాదం

- బస్సును ఢీకొన్న లారీ
- 21 మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఇనుప లోడు లారీ



క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

తుని రూరల్: అతి వేగమే ప్రమాదానికి కారణమైంది.. మరో మూడు కిలోమీటర్లు వెళ్తే తమ గమ్యస్థానాన్ని చేరుకుంటామని ఆత్రుతగా ఉన్న ప్రయాణికుల ఆర్టీసీ బస్సును ఇనుము లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఏం జరిగిందో తెలియక వారంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. బుధవారం తుని మండలం వెలంపేట జంక్షన్‌లోని జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. రూరల్ ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి 55 మంది ప్రయాణికులతో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు తుని వెళ్తూ మూడు కిలోమీటర్ల దూరంలోని వెలంపేట జంక్షన్‌కు చేరుకుంది. ఆ జంక్షన్‌లో తుని వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా ఇనుము లోడుతో పశ్చిమ బెంగాల్ నుంచి కేరళ వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఆ దాటికి ఆర్టీసీ బస్సు సెంటర్ డివైడర్‌పైకి ఎగిరిపడగా జాతీయ రహదారి దాటేందుకు వేచిఉన్న మోటార్ సైకిలిస్టు డివైడర్‌పై పడ్డాడు. త్రుటిలో పలువురు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటనలో లారీ డ్రైవర్, మోటారు సైక్లిస్ట్, బస్సులో ఉన్న కండక్టర్ సహా 21 మంది గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను హైవే అంబులెన్స్, రెండు 108 అంబులెన్స్‌ల్లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆసుపత్రి అంతా క్షతగాత్రులతో కిక్కిరిసిపోయింది. వైద్యులు, సిబ్బంది హుటాహుటిన బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఎక్స్‌రేలు తీశారు. తునిలో కూలిపనికి వచ్చిన తాను పని లేకపోవడంతో స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు కోటనందూరు మండలం కొత్త కొట్టాంకు చెందిన మోటారు సైక్లిస్ట్ అడిగర్ల రమణారావు తెలిపారు. క్షతగాత్రుల్లో లారీ డ్రైవర్, మోటార్ సైక్లిస్ట్, కండక్టర్‌తో సహా 21 మంది ఉన్నారు. ఇందులో సీహెచ్ పద్మరాజు (తిరుపతిపాలెం), ఎ.అప్పలరాజు (వేలంకి), ఎల్.అప్పలనర్స (చినశంకర్లపూడి), ఈసం వెంకటలక్ష్మి, జి.సత్యవతి (శృంగధార), మళ్ల లక్ష్మి, మళ్ల వరలక్ష్మి (కిర్లంపూడి), కర్రి పేరంటాలు (పెద శంకర్లపూడి), టి.వెంకటేశ్వరరావు (కండక్టర్), ఆదిలక్ష్మి (నర్సీపట్నం), వరలక్ష్మి (రాజవరం), ఎస్.చిట్టిబాబు, జి.పావని (నర్సీపట్నం), పి.సత్యవతి (రాచపల్లి), దారూ రామ్ (లారీ డ్రైవర్), ఎస్.వరహాలు (బెండపూడి), వి.భీమరాజు, వి.నమిత (గర్భిణి–పెదబయలు), ఎ.వెంకటేశ్వరరావు (గుడివాడ), కర్రెడ్ల సురేష్ (తేటగుంట), మోటార్ సైక్లిస్ట్ అడిగర్ల రమణారావు (కొత్త కొట్టాం) గాయపడ్డారు. సంఘటనా స్థలం నుంచి క్షతగాత్రులను అంబులెన్సుల్లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అప్పలరాజును కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై రమేష్‌బాబు వివరించారు.

కోళ్లఫారంపై జంకు పిల్లి దాడి



చనిపోయిన కోళ్లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నల్లజర్ల: మండలంలోని నబీపేట శివారు దుప్పిగుంటలో రైతు పిన్నమని దుర్గారావు తాను లీజుకు తీసుకున్న ఆయిల్‌ఫామ్ తోటలో పెంచుతున్న నాటుకోళ్ల ఫారంపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. 20 నాటు కోళ్లను హతమార్చింది. కేవలం కోళ్ల మెడ కొరికి రక్తం పీల్చి వదిలేసింది. ఈ ప్రాంతం రిజర్వు ఫారెస్టుకు సమీపంలో ఉండటంతో చిరుత పులి దాడి చేసి ఉండవచ్చని కొందరు భావించారు. కొన్ని ప్రచార మాధ్యమాల్లో చిరుతపులి సంచారం అంటూ ప్రచారం చేశారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేయగా సంబంధిత గార్డు శ్రీనివాసరావు తమ సిబ్బందితో వచ్చి సంఘటనా స్థలాన్ని, ఆ జంతువు అడుగు జాడలను పరిశీలించారు. ఇవి చిరుత జాడలు కావని, అసలు అడవి జంతువువే కాదన్నారు. కొందరు చిరుత పులి అంటూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఏడీఏ మోజెస్ జాన్‌వెస్లీ తమ సిబ్బందితో వచ్చి ఆ ప్రాంతాన్ని, చనిపోయిన కోళ్లను పరిశీలించి ఇది జంకుపిల్లి దాడిగా గుర్తించారు. ఇది అత్యంత ప్రమాదకర వైల్డ్ కేట్‌గా వివరించారు. పాదముద్రలు కూడా వాటివేనని నిర్ధారించారు. రైతు మాట్లాడుతూ 12 పుంజులు, 8 చిన్నసైజు పుంజులతో కలిపి వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని వివరించారు.

సిలిండర్ లీకేజీతో చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉప్పలగుప్తం: భోజన హోటల్‌లో గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగిన సంఘటన ఉప్పలగుప్తం గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కోలా సత్యవతి అనే మహిళ గ్రామంలోని ఓ డాబాలో భోజన హోటల్ నిర్వహిస్తోంది. ఆమె కుమారుడు, కోడలు వేరేచోట నివసిస్తున్నారు. మనవడు, మనవరాలితో కలిసి సత్యవతి హోటల్ పక్క గదిలోనే ఉంటోంది. పనులు ముగించుకుని మంగళవారం రాత్రి మనవడు, మనవరాలితో కలిసి ఇంట్లోనే నిద్రించింది. బుధవారం ఉదయం నీళ్లు కాచుకుందామని గ్యాస్ స్టౌ వెలిగించేందుకు యత్నించింది. అప్పటికే గ్యాస్ లీకై, గదంతా వ్యాపించి ఉంది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ప్రాణభయంతో సత్యవతి తన మనవడు, మనవరాలిని తీసుకుని హుటాహుటిన ఇంటి నుంచి బయటకు పరుగులు తీసింది. ముగ్గురూ ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, ఇంట్లో కొంత సామగ్రి అగ్నికి ఆహుతైంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న మమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.80 వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని వీఆర్‌ఓ గనిశెట్టి వీరవేణి తెలిపారు.

కల్తీ నెయ్యి గుట్టు రట్టు

టన్ను సరకు స్వాధీనం



కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై నివేదిక తయారు చేస్తున్న అధికారులు

అనపర్తి: మండలంలోని పొలమూరులో కల్తీ నెయ్యి వ్యాపారం గుట్టు రట్టు చేశారు. ఆ గ్రామంలో నకిలీ నెయ్యి తయారు చేస్తున్నారనే సమాచారంతో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా ఎస్పీ సుబ్బారెడ్డి నేతృత్వంలో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పొలమూరుకు చెందిన టి.రాజారెడ్డి స్వీట్లు తయారీకి రెండు వేర్వేరు పేర్లతో లైసెన్సు పొందిన నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కల్తీ నెయ్యి తయారీకి గాను పామాయిల్, డాల్డా, సన్‌ఫ్లవర్ ఆయిల్‌తోపాటు నెయ్యి ఫ్లేవర్, రంగు, రుచి కోసం ఆరోగ్యానికి హాని కలిగించే వివిధ రసాయనాలు వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తయారు చేసిన కల్తీ నెయ్యిలో కొంత భాగం ఒడిశా తరలించి మరికొంత చీకటి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ తయారీ కేంద్రంలో సుమారు రూ.7 లక్షల విలువ చేసే ముడి సరుకు స్వాధీనం చేసుకోవడంతోపాటు సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ కె.శామ్యూల్‌రాజ్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం వార్షిక బడ్జెట్ ఆమోదం

- రూ.177.14 కోట్ల అంచనాతో పనులు
- దేవస్థానం ట్రస్ట్ బోర్డు తీర్మానం



సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, సభ్యులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.177.14 కోట్ల అంచనాతో వార్షిక బడ్జెట్‌ను ధర్మకర్తల మండలి బుధవారం ఆమోదించింది. ఆదాయం అంచనా రూ.177.25 కోట్లుగా రూ.11 లక్షలు మిగులుగా చూపించింది. అన్నవరం దేవస్థానంలో చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశానికి ఈఓ రామచంద్రమోహన్, ఏసీ విశ్వనాథ్‌రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు హాజరయ్యారు. బడ్జెట్‌లో వ్రత విభాగం ద్వారా రూ.42 కోట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.24.74 కోట్లు, హుండీల నుంచి రూ.22 కోట్లు, షాపుల లీజుల ద్వారా రూ.19.16 కోట్లు, వసతి సత్రాల గదుల అద్దెల నుంచి రూ.పది కోట్లు, ఇతర విభాగాల నుంచి సుమారు రూ.60 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఎస్టాబ్లిస్‌మెంట్ చార్జీల కింద రూ.41.30 కోట్లు, వివిధ ముడి సరుకులు, రసవర్గాల కొనుగోళ్లకు రూ.35 కోట్లు, ఇంజినీరింగ్ విభాగం కింద వివిధ నిర్మాణాలు, మెయింటెనెన్స్ కింద రూ.పది కోట్లు, విద్యుత్ విభాగానికి రూ.4.5 కోట్లు, వ్రత పురోహితుల, ప్రసాదం ప్యాకర్స్, నాయీ బ్రాహ్మణుల పారితోషికం కింద రూ.21.50 కోట్లు, సీజీఎఫ్ చెల్లింపుల కింద రూ.19.50 కోట్లు, సెక్యూరిటీ కింద రూ.4.5 కోట్లు, విద్యాసంస్థలు, ఆగమ పాఠశాల, దత్తత ఆలయాల నిర్వహణకు రూ.ఐదు కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇంకా మిగిలిన వాటికి సుమారు రూ.40 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

ఇతర అంశాలు ఇలా..

వనదుర్గ ఆలయానికి కొత్తగా నిర్మించిన రోడ్డు అసంపూర్తి పనులు పూర్తికి రూ.26 లక్షలతో అంచనాలను, సత్యగిరి నుంచి గిరిప్రదక్షిణ రహదారిని కలిపే లింక్ రోడ్డు వాహనాల ప్రయాణానికి అంత అనువుగా లేనందున ఆ పనులు నిలిపివేసి రూ.4.5 లక్షలతో రోడ్డుకు అడ్డుగా గోడ కట్టేందుకు తీర్మానించారు. వై.జంక్షన్ నుంచి హరిహర సదన్ సత్రానికి వెళ్లే రోడ్డులో రూ.9.5 లక్షలతో రిటైనింగ్ వాల్, సత్యదేవుని పెద్ద రథానికి నూతన రథశాలను కొండ దిగువన పంపా సత్రం ఆవరణలో నిర్మించాలని తీర్మానించారు. గతంలో ఆర్యవైశ్య సత్రం ఎదురుగా కొండను తొలిచి రూ.40 లక్షలతో రథశాల నిర్మించాలని చేసిన ప్రతిపాదన రద్దు చేసి కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలని నిర్ణయించారు. అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయమైన కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామివారి దేవాలయానికి రూ.40 లక్షలతో మెట్ల దారి అభివృద్ధి చేయాలని తీర్మానం చేశారు. స్వామివారి వార్షిక కల్యాణానికి రూ.38 లక్షలతో వివిధ పనులు చేపట్టాలని, కిర్లంపూడిలోని కల్యాణ మండపానికి రూ.18 లక్షలతో రంగులు వేయాలనే పనులకు ఆమోదం తెలిపారు. మే నెలలో జరగనున్న సత్యదేవుని వార్షిక కల్యాణ మహోత్సవాలకు రూ.46.75 లక్షలతో ఆలయ పరిసరాల్లో భవనాలకు రంగులు, చలువ పందిళ్లు, కూల్ పెయింట్లు, తాత్కాలిక విద్యుత్ అలంకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ.40 లక్షలతో భక్తులకు స్టెయిన్‌లెస్ క్యూలైన్లు, బెంచీలు ఏర్పాటుకు తీర్మానించారు.

కబడ్డీ క్రీడాకారులను మరింత తీర్చిదిద్దుతాం



ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలో సుమన్, బాలకృష్ణారెడ్డిలతో కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న వెంకటరెడ్డి, శ్రీకాంత్


రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి

రావులపాలెం: కబడ్డీ క్రీడాకారులను మరింత తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ వెంకటరెడ్డి) అన్నారు. బుధవారం రావులపాలెంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలకు సంబంధించి విశాఖపట్నంలో మంగళవారం రాత్రి ముగింపు కార్యక్రమం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారన్నారు. కబడ్డీలో రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులను మరింత తీర్చిదిద్దాలంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్‌కు బాధ్యత అప్పగించారన్నారు. లాంగ్ టర్మ్ కోచింగ్‌లో భాగంగా ప్రో కబడ్డీ క్యాంప్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమన్, బాలకృష్ణారెడ్డిలను, అలాగే ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కోచింగ్ క్యాంపునకు సంధ్య, సతీష్‌లను అప్పగించారన్నారు. దానికి కట్టుబడి వారిని అన్నివిధాలా తీర్చిదిద్దుతామని వెంకటరెడ్డి తెలిపారు. త్వరలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ తరపున ప్రో కబడ్డీ తరహా ఆంధ్ర కబడ్డీ లీగ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్, వైజాగ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

అమలాపురం రూరల్: అమలాపురం మండలం కామనగరువు హైవే రోడ్డు ఆమని ఆటో మొబైల్స్ గోడౌన్ సమీపంలోని మురుగు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. అతని వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉంది. ఒంటిపై ముదురు నీలం రంగు ఖాకీ షర్ట్, నలుపు రంగు నిక్కర్ ఉందని ఎస్సై శేఖరబాబు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఏడిద నారాయణమ్మ (ఫైల్)

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఏడిద నారాయణమ్మ(100) మంగళవారం రాత్రి మృతి చెందారు. గత మూడు నెలలుగా వృద్ధాప్య సమస్యతో బాధపడుతూ ఆమె తుది శ్వాస విడిచారు. అంతకు ముందు వరకూ ఆమె పనులను ఆమె చలాకీగా చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండేవారు. ఆమె సంరక్షకుడు పెద్దింశెట్టి వీరబాబు, సుబ్బలక్ష్మి దంపతులకు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు సానుభూతిని వ్యక్తం చేశారు.